వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర, ఏప్రిల్ 8 : పట్టణ ప్రజల ఆరాధ్య దైవమైన ఈశ్వర వీరప్పయ్య స్వామి మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని తన గృహంలో ఈశ్వర వీరప్పయ్య స్వామి మహోత్సవ వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, రాంపాండు, వర్మ, శ్రీనువాస్‌రెడ్డి, శ్రీనివాస్‌సాగర్ పాల్గొన్నారు.

కందూరులో నాణ్యత లేని ప్రసాదాలు విక్రయం

గుండ్రాళ్లను తలపించేలా ఉన్న లడ్డూ

మూసాపేట(అడ్డాకుల), ఏప్రిల్ 8 : మండలంలోని కందూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో నాణ్యత లేని ప్రసాదాలు విక్రయిస్తున్నారని భక్తులు వాపోతున్నారు. స్వామి వారి లడ్డూలు ఒక్కటి రూ.15 లకు విక్రయిస్తున్నారని, కానీ ఆ లడ్డూలు గట్టిగా ఉంటున్నాయని భక్తులు వాపోతున్నారు. నాణ్యత లేని ప్రసాద లడ్డూలు తినలేకపోతున్నామని చెప్పుకొచ్చారు. అధికారులు పట్టించుకోకపోవడంతో టెండరు దారుడు ఇష్టానుసారంగా ప్రసాదాలు విక్రయిస్తున్నట్లు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. లడ్డూ ప్రసాద విక్రయ టెండర్లు నిబంధనలు పెట్టామని కందూరు రామలింగేశ్వరస్వామి ఆలయ ఈవో రాజేశ్వర్ శర్మ పేర్కొన్నారు. ప్రసాదాల తయారీలో ఏలాంటి లోపాలు ఉన్నా వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో కూడా లడ్డూలు గట్టిగా ఉన్నాయంటే, వేరే తయారు చేయించామని, మంగళవారం ఉదయం పరిశీలించి ప్రసాదాల తయారీలో లోపం ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు.

పోలింగ్ సిబ్బందికి ముగిసిన శిక్షణ

పాలమూరు, ఏప్రిల్ 8: మహబూబ్‌నగర్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల పోలింగ్ సిబ్బందికి నిర్వహించిన మొదటి శిక్షణ సోమవారం ముగిసిందని జిల్లా పోలింగ్ శిక్షణా నోడల్ అధికారి డా.శ్రీధర్ సుమన్ తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు సహాయక ప్రిసైడింగ్ అధికారులు, ఇతర అధికారుల శిక్షణ పూర్తయ్యిందన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గం వారికి ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో, జడ్చర్ల నియోజకవర్గం వారికి బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో, దేవరకద్ర నియోజకవర్గం వారికి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రోజుకు రెండు బ్యాచ్‌ల చొప్పున మొత్తం ఆరు బ్యాచులకు శిక్షణ పూర్తయిందని తెలిపారు. మూడు రోజులుగా జరిగిన శిక్షణ కార్యక్రమంలో గైర్హాజరైన వారికి 10వ తేదీన బుధవారం ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక శిక్షణ నిర్వహించనున్నారు. ఎటువంటి సమాచారం లేకుండా ప్రత్యేక శిక్షణకు కూడా హాజరుకాని వారిపై కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన జడ్చర్ల బార్‌అసోసియేషన్ సభ్యులు

జిల్లా జడ్జి పాపిరెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

జడ్చర్ల, ఏప్రిల్ 8: జడ్చర్ల కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్జి పాపిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే నూతన కార్యవర్గం ఎన్నికైందని తెలిపారు. జడ్చర్ల కోర్టులో ఉన్న పలు సమస్యలను జడ్జి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి జడ్జి పాపిరెడ్డి సానుకూలంగా స్పందించి, తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బి.యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాపోతుల శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి రాములు, కోశాధికారి శ్రీశైలం ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీపీ

భూత్పూర్, ఏప్రిల్ 8 : మండలంలోని మద్దిగట్లలో మూడు రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడిన కొత్తకుర్వ శ్రీశైలం కుటుంబాన్ని సోమవారం ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం మృతుని భార్య శ్రీశైలకు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా మృతునికి కుమారుడిని చదివించే బాధ్యతను తీసుకుంటానని హామీ ఇచ్చారు.

సమాజ మార్పునకు కృషి చేయాలి

కవులను సన్మానిస్తున్న సభ్యులు

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 8: కవులు తమ కవితా రచనలతో సమాజమార్పునకు కృషి చేయాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్, మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణభట్టడ్ అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని బాలకేంద్రంలో ఎస్పీ బాలు అభిమాన సంఘం ఆధ్వర్యంలో తెలుగుభాష కవులు రామ్మోహన్, మల్లేశ్, చిన్నయ్య, శ్రీశైలం, సత్యనారాయణ, చంద్రశేఖర్, నర్సింహులు పూలమాల శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు వర్తమాన అంశాలను ఒడిసిపట్టి నూతన రచనలతో నూతనత్వానికి నాంది పలకాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, జనరల్ ఫిజీషియన్ కార్తీక్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజు, ఎస్పీ బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నర్సింహులు, వసంత్‌కుమార్ ఉన్నారు.

చిన్నపొర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాటర్‌బెల్

ఊట్కూర్, ఏప్రిల్ 8: మండలంలోని చిన్నపొర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం వాటర్ బెల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్పీ శ్రీకాంత్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు రాయల్ హెన్నా మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తల్లో అతి ముఖ్యమైనది నీళ్లు ఎక్కువగా తాగడమని తెలిపారు. విద్యార్థులు శరీరం డీహైడ్రేట్ కాకుండా, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రోజుకు మూడుసార్లు ఉదయం 8:45, 10:05, 11:50గంటలకు వాటర్ బెల్ ఉపయోగించి నీళ్లు తాగేందుకు బ్రేక్ ఇస్తున్నట్లు తెలిపారు. కాగా, జిల్లాకు ఆరంజ్ అలెర్ట్ ఉన్న కారణంగా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎర్త్ లీడర్లు అర్చన, కీర్తన, రాము, టీచర్ శ్రీకాంత్ ఉన్నారు.

నీళ్లు తాగుతున్న విద్యార్థులు

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు

- సర్కారు బడుల బలోపేతమే లక్ష్యం
- జూన్ 10నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
- నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష

సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మద్దూర్ (కొత్తపల్లి), ఏప్రిల్ 8: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, నిర్వహణలోఅమ్మల(తల్లుల)ను భాగస్వాములుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసం ఇకపై ప్రతి పాఠశాలలో అమ్మ ఆదర్శపాఠశాల కమిటీలు ఏర్పాటు చేయనున్నామని నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం మద్దూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మద్దూర్, కోస్గి మండలాల్లోని గ్రామ సమాఖ్య అధ్యక్షురాళ్లు, ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరయ్యారు. మద్దూర్, కోస్గి మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌గా ఆయా గ్రామ సంఘాల అధ్యక్షులు వ్యవహరిస్తారని, కో చైర్మన్‌గా ఆ పాఠశాల హెచ్‌ఎం ఉంటారన్నారు. ఈ ఇద్దరితో పాటు కమిటీలో ప్రతి తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లులు (అన్ని సామాజికవర్గాల వారు) సభ్యులుగా ఉంటారని చెప్పారు. ఈ కమిటీలు రెండేండ్ల పాటు కొనసాగుతాయని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తీర్మానాలు చేసి అభివృద్ధి పనులు చేపడతారని తెలిపారు. కొన్నిచోట్ల ఒకే పాఠశాల ఉండి రెండు మహిళా సంఘాలు ఉన్నట్లయితే ఒక్కొక్కరికీ ఏడాది పాటు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌గా కొనసాగే అవకాశం ఉంటుందన్నారు. ఈ కమిటీల ద్వారా రూ.25 వేల వరకు పాఠశాలల్లో కిటికీలు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, మరమ్మతులు తరగతి గదిలో ఎల్‌ఈడీ స్విచ్ బోర్డుల ఏర్పాటు పనులను చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఇక రూ.50వేల నుంచి రూ.లక్ష వ్యయం వరకు చేసే అభివృద్ధి పనులకు ఎంపీడీవో అనుమతి తీసుకొని ఎవరైతే తొందరగా పనులు చేస్తారో వారికే ఆ పనులను కమిటీ తీర్మానం చేసి అప్పగించాలన్నారు. రూ.లక్షకు మించి చేసే అభివృద్ధి పనులకు తాను (కలెక్టర్) అనుమతి ఇస్తానని తెలిపారు. మద్దూర్, కోస్గి మండలాల్లో ఇప్పటికే దాదాపు 55 పాఠశాలల్లో చేయాల్సిన అభివృద్ధి పనులు ఎస్టిమేట్లను ఇంజినీరింగ్ విభాగం అధికారులు తయారు చేశారని, ఆయా పాఠశాలల అమ్మ కమిటీలు తీర్మానం చేస్తే ఒకటి రెండు రోజుల్లో పనులు కూడా ప్రారంభించవచ్చని కలెక్టర్ తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా తీర్చిదిద్ది రాష్ట్రంలోనే ఆదర్శంగా మార్చాలని కలెక్టర్ ఈసందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు హెచ్‌ఎంలను ఆదేశించారు.

డాక్యుమెంటరీ..

పాఠశాలల అభివృద్ధి పనులకు సంబంధించి డాక్యుమెంటరీ తీయాల్సి ఉంటుందని, అందువల్ల పనులు చేపట్టకముందు, తర్వాత తప్పకుండా ఫొటోలు తీయాలని హెచ్‌ఎంలకు సూచించారు. మద్దూరు, కోస్గి మండలాల్లోని 96 అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల పేరిట బ్యాంకుల్లో ఖాతాలు తెరిచామని, ఆయా పనులకు సంబంధించి నాలుగో వంతు నిధులను కూడా విడుదల చేశామన్నారు. ఇప్పటికే నిలిచిపోయిన 'మన ఊరు మన బడి' పనులను ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, డీఈవో అబ్దుల్ ఘని, అదనపు డీఆర్డీవో అంజయ్య, మద్దూర్ ఎంపీడీవో జయరాము లు, తాసీల్దార్ మహేశ్‌గౌడ్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు అనిత, కోస్గి మెప్మా అధ్యక్షురాలు శోభ, కోస్గి ఎంపీడీవో మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

గైర్హాజరైన వారికి 10న శిక్షణ

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 8: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ శిక్షణకు గైర్హాజరైన వారికి ఈనెల 10న బుధవారం ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక శిక్షణ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రవినాయక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు గైర్హాజరైన 160 మంది హాజరుకావాలని సూచించారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 8 : తెలంగాణ రాష్ట్ర మైనార్టీ శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ హైదరాబాద్ ఆధ్వర్యంలో యుపీఎస్సీ-కాస్ట్ 2025 విద్యా సంవత్సరంలో వందమంది మైనార్టీ అభ్యర్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి రవీంద్రనాథ్ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు రిజర్వేషన్ల ప్రకారం మహిళల అభ్యర్థులకు 33శాతం, వికలాంగులకు 5శాతం సీట్లు కేటాయిస్తారన్నారు. జిల్లాలోని అన్ని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులకు ఈనెల 22న చివరి తేదీ అని, మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040-23236112లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్, ట్రాక్టర్ పట్టివేత

నవాబ్‌పేట, ఏప్రిల్ 8 : మండలంలోని కారూర్ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా నవాబ్‌పేట శివారులో టిప్పర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై అభిషేక్‌రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. మల్లారెడ్డిపల్లికి చెందిన పడమటి శివ కొంతకాలంనుంచి టిప్పర్ ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గత ఆదివారం అర్ధరాత్రి కారూర్ వాగు నుంచి టిప్పర్‌లో ఇసుకను తరలిస్తుండగా వలపన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మాగనూర్‌లో..

మాగనూర్, ఏప్రిల్ 8: మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున ట్రాక్టర్ పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని అడవి సత్యారంలో శనివారం మధ్యరాత్రి రెండు గంటల సమయంలో ఇసుక తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో వెంటనే అక్కడికి వెళ్లి చూడగా అడవిసత్యారం గ్రామానికి చెందిన నర్సింహులు టీఎస్ 06 ఈడబ్ల్యూ 4335 ట్రాక్టర్‌లో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఉన్నాడు. దీంతో ట్రాక్టర్‌ను మాగనూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, నరసింహులుపై కేసు నమోదు చేశామని ఎస్సై మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధైర్యంగా ఓటు వేయాలి

మాగనూరు, ఏప్రిల్ 8: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్సై ఎండీ అబ్దుల్ ఖాదర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సోమవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలు ఉజ్జెల్లి, భైరంపల్లి గ్రామాల్లో పోలీసు, కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించారని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 8: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తాలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఆ సంఘం నాయకులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అప్పం అనంతరాములు మాట్లాడుతూ ఇతర ప్రాంతాలనుంచి ప్రతి రోజూ జిల్లా కేంద్రానికి ఎంతోమంది ప్రజలు వస్తుంటారని, ఎండ తీవ్రంగా ఉండంతో వారి దాహం తీర్చిందుకే చలివేంద్రం ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, సూర్యప్రతాప్, బాలరాజుసుకుమార్, కిశోర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన కురుమూర్తి గిరులు

దేవరకద్ర రూరల్,(చిన్న చింతకుంట) ఏప్రిల్ 8 : చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామ సమీపంలోని సప్తగిరులలోని శ్రీకురుమూర్తి స్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు భారీ సంఖ్యలో కొండకు తరలివచ్చారు. ఆలయ పరిపర ప్రాంతం అంతా భక్తి పారవశ్యంతో నిండిపోయింది.

మండల సభలో సమస్యల వెల్లువ

సభలో మాట్లాడుతున్న ఎంపీపీ కళావతి, పాల్గొన్న సభ్యులు

మూసాపేట, ఏప్రిల్ 8 : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు మండల సభ దృష్టికి తీసుకొచ్చారు. సోమవారం మూసాపేట రైతు వేదికలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీ కళావతితోపాటు సభ్యులు సీజీ గోవర్ధన్, సత్యనారాయణ, సంతోష హాజరయ్యారు. నిజాలాపూర్ నుంచి మహ్మద్‌హుస్సేన్‌పల్లి వరకు జానంపేట నుంచి తాళ్లగడ్డ వరకు మంజూరైన బీటీ రోడ్డు పనులు ఎందుకు ప్రారంభించడం లేదని, ప్రతి రోజు ప్రజలు ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు సభ్యుడు సీజీ గోవర్ధన్ సభ దృష్టికి తీసుకొచ్చారు. చేసిన పనులను బిల్లులు ఎందుకు ఇవ్వడం లేదని, నిధులు మంజూరు చేయడం లేదని వేముల ఎంపీటీసీ సత్యనారాయణ అధికారులను ప్రశ్నించారు. రేషన్ కార్డుల విషయమమై తాసీల్దార్ బ్రహ్మంగౌడ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే మంజూరు చేస్తామని చెప్పారు. ఎండలు ఎక్కువగా ఉన్నందునా ఉదయం 11:30గంటల్లోపే పనులు ముగించుకోవాలని సీహెచ్‌వో జైపాల్ చెప్పారు. పశువైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ గ్రామాల్లో చెరువులు, కుంటల్లో నీళ్లు అడుగంటి పోయాయి. కావున గ్రామాల్లో పశువుల తొట్లు అందుబాటులో ఉంటే వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఎంఈవో రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల వివరిస్తూ పాఠశాల అభివృద్ధికి గతంలో ఏర్పాటు చేస్తున్న ఎస్ఎంసీ చైర్మన్ స్థానంలో ప్రస్తుతం మహిళా సంఘాల ప్రతినిధులను నియమించనునట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఎం చారి, ఎంపీడీవో కృష్ణయ్య, ఎంపీవో సరోజ, ఏవో రాజేందర్‌రెడ్డి, ఏఈ లక్ష్మణ్‌గౌడ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

- వివరాలు వెల్లడించిన ఎస్పీ యోగేశ్ గౌతమ్

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ యోగేశ్ గౌతమ్

నారాయణపేట, ఏప్రిల్ 8: పట్టణంలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిని గుర్తించి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ యోగేశ్ గౌతమ్ చెప్పారు. సోమవారం ఏర్పాటు చేసిన వివరాల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఈనెల 5న పట్టణంలోని ప్రభుత్వ దవాఖాన వెనకాల మరుతి(41) అనే వ్యక్తిని హత్య చేసి కాల్చివేశారని, దీంతో మృతుడి సోదరుడు నారాయణ ఫిర్యాదు మేరకు డీఎస్పీ లింగయ్య ఆధ్వర్యంలో సీఐ శివశంకర్ తన సిబ్బందితో దర్యాప్తు చేపట్టారని తెలిపారు. పట్టణానికి చెందిన నర్సింహులు అలియాస్ నజీర్ హత్య చేసినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. నర్సింహులు అలియాస్ నజీర్‌కు చిన్నతనంలోనే తండ్రి మరణించగా, తల్లి ఇటీవల మరణించిందని, తోబుట్టువులు ఎవరూ లేరని, జల్సాలకు అలవాటు పడిన నర్సింహులు చోరీలు చేసి జైలుకు కూడా వెళ్లి వచ్చాడని చెప్పారు. ఈనెల 4న రాత్రి 11గంటల ప్రాంతంలో నారాయణపేట పట్టణానికి చెందిన వివాహిత ఇంటికి వెళ్లి ఆమెపై అత్యాచారానికి ప్రయత్నించాడు. దీంతో కోపోద్రిక్తుడైన నర్సింహులు, మారుతి ని ప్రభుత్వ దవాఖాన వెనకాలకు తీసుకెళ్లి రాయితో కొట్టి హత్యచేసి నిప్పంటించి వెళ్లిపోయినట్లు ఎస్పీ తెలిపారు. కేసు విచారణను ప్రారంభించిన పోలీసులు సోమవారం నిందుతుడిని అదుపులోకి తీసుకున్నారు.

ఈ కేసును చేదించడంలో కృషి చేసిన సిబ్బంది ఆంజనేయులు, రాములును ఎస్పీ అభినందించారు. సమావేశంలో డీఎస్పీ లింగయ్య, ఎస్సై వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాధితులకు మెరుగైన సేవలు అందించాలి

- ఎస్పీ యోగేశ్ గౌతమ్

నారాయణపేట, ఏప్రిల్ 8 : సైబర్ క్రైమ్ బాధితులకు సైబర్ వారియర్స్ మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న సైబర్ వారియర్లకు సెల్‌ఫోన్, సిమ్ కార్డు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలను త్వరగా చేదించేందుకు సైబర్ వారియర్లకు ప్రత్యేకంగా సెల్‌ఫోన్, సిమ్ కార్డు అందజేసినట్లు చెప్పారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 లేదా పోర్టల్‌లో లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. బాధితులు మోసపోయిన డబ్బును త్వరగా ఇప్పించేందుకు నూతన పద్ధతిని వారియర్స్‌కు తెలియజేశామని, ఇదివరకే సైబర్ నేరాలకు గురైన వ్యక్తులు ఉంటే వారి డబ్బులు బ్యాంకులో ఫ్రీజ్ అయి ఉన్నా వారియర్స్ త్వరగా డబ్బులు వచ్చేలా కృషి చేస్తారన్నారు. సైబర్ నేరాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎసీఆర్‌బీ ఎస్సై సునీత పాల్గొన్నారు.

కోర్టులో పరిష్కరించుకోవాలి

సివిల్ ఫిర్యాదును కోర్టులో పరిష్కరించుకోవాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఐదు ఫిర్యాదులు వచ్చాయి. బాధితుల ఫిర్యాదులు నేరుగా స్వీకరించిన ఎస్పీ చట్టప్రకారం పరిశీలించి పరిష్కరించాలని సీఐలు, ఎస్సైలను ఫోన్‌లో ఆదేశించారు.

పండుగను సంతోషంగా జరుపుకోవాలి..

జిల్లా ప్రజలు ఉగాది పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఉత్సాహంగా, సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. తీపి, చేదు, కష్టసుఖాలతో కూడినదే జీవితమని, జీవితంలో ఆనందోత్సవాలు పూయించేందుకు వచ్చిందే ఉగాది ఉండుగ అన్నారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

నిర్మాణ పనులను అడ్డుకున్న అధికారులు

- కోర్టు ఆదేశాలున్నాయన్న యజమాని

నిర్మాణ పనులు నిలిపివేయాలని సూచిస్తున్న అధికారులు

మరికల్, ఏప్రిల్ 8: మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 1లో గల ప్రభుత్వ భూమిలో పంచాయతీ అనుమతి లేకుండా చేపట్టిన ఇంటి నిర్మాణ పనులను అధికారులు అడ్డుకున్నారు. తాము కోర్టు ఆదేశాల మేరకే పనులు చేపట్టామంటూ భవన యజమాని పనులను కొనసాగించారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. మండల కేంద్రానికి చెందిన కస్పే లక్ష్మయ్య ఇంటి నిర్మాణ పనులు చేపట్టగా, పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి అక్కడికి వెళ్లి ఆ పనులు నిలిపివేయాలని యజమాని కస్పే లక్ష్మయ్యకు చెప్పారు. ప్రభుత్వ స్థలంలో అనుమతి లేకుండా నిర్మాణం చేయడం తగదన్నారు. ఇది ప్రభుత్వ స్థలంకాదంటూ, కోర్టు నుంచి నిర్మాణం పనులకు అనుమతులు ఉన్నాయని, అధికారులు మాపై కక్ష కట్టి పనులు ఆపేందుకు ప్రయత్నిస్తున్నారని లక్ష్మయ్య అధికారులతో వాగ్వాదానికి దిగారు. సర్వేనెంబర్-1 ప్రభుత్వ స్థలమని, తాసీల్దార్ సునీత నోటీసులు ఇవ్వడంతోనే పనులునిలిపివేసేందుకు వచ్చామన్నారు. కోర్టు వ్యవహారంతో మాకు సంబంధం లేదన్నారు. కలెక్టర్ ఆదేశాలతో నిర్మాణం పనులు నిలిపేందుకు వచ్చామని చెప్పారు. అక్రమ నిర్మాణాన్ని కూల్చడానికి పోలీస్ రక్షణ కావాలని తాసీల్దార్ మరికల్ పోలీసులకు వినతిపత్రం ఇచ్చినా, పోలీసులు సంఘటనా స్థలానికి రాకపోవడంతో చేసేదిలేక అధికారులు వెనుతిరిగారు. సర్వేనెంబర్ 1లో మాకు నాలా అనుమతులు ఇవ్వడం జరిగిందని, డీటీసీపీ లేఆవుట్‌కు దరఖాస్తు చేసుకున్నా అనుమతి ఇవ్వలేదని నిర్మాణదారులు తెలిపారు.

విద్యార్థికి అభినందన

డాక్టర్ పట్టాను స్వీకరిస్తున్న మునగల శెట్టి సూర్యానంద్

మూసాపేట(అడ్డాకుల), ఏప్రిల్ 8 : అడ్డాకుల మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన మునగల శెట్టి పారిజాత, ఆనందంలది పేద కుటుంబం. వారి పెద్ద కుమారుడు మునగల శెట్టి సూర్యానంద్ కష్టపడి చదువుతూ సిద్దపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2018 లో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ఎంబీబీఎస్ గ్రాడ్యూయేషన్ పూర్తి చేసుకున్న సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ విమల్ థామస్ నుంచి డాక్టర్ పట్టాను తీసుకున్నాడు. అందుకు సోమవారం గ్రామ పెద్దలు, నాయకులు మునగల శెట్టి సూర్యానంద్‌తో పాటు అతని తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు. చదువుకు పేదరికం అడ్డురాదని, అతడిని చూసి విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

వ్యవసాయ మార్కెట్‌కు సెలవులు

దేవరకద్ర, ఏప్రిల్ 8 : దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌కు ఐదు రోజులపాటు సెలవులు ఉన్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి జయశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంగళవారం ఉగాది, 10న హమాలీలా విన్నపం మేరకు సెలవు, 11, 12 వ తే